ప్రజాశక్తి
శనివారం 11 మార్చి 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రలోభాలే అజెండా..!

- ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా ప్రశ్నించని వైసిపి
- ఎమ్మెల్సీ బరిలో ప్రజా సమస్యలపై అవగాహన లేని అభ్యర్థి
- సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల ఓట్లడిగే హక్కుందా?



శుక్రవారం సుధాకర్ కార్యాలయంలో కనిపించిన వెండి వస్తువుల ప్యాకెట్లు

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైసిపి తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి బరిలోకి దిగిన సీతంరాజు సుధాకర్‌కు అధికార పార్టీ జెండా నీడ తప్ప ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పట్ల ఎలాంటి అవగాహనా, అజెండా లేదు. పోరాటం చేసిన ఒక్క సందర్భమూ లేదు. పైగా వెండి వస్తువులు ఎర వేస్తూ శుక్రవారం ఆయన అడ్డంగా దొరికేశారు. ఆయనకు ఓట్లు అడిగే హక్కు ఇంకెక్కడిది' అని పలువురు పట్టభద్రులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల్లోనూ దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోటీలో ఉండాలంటే పార్టీ మద్దతు ఒక్కటేనా ఇతర గుణగణాలేవీ అవసరం లేదా ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ

వెండి నాణేలను తరలిస్తున్న వ్యక్తి

వాటి పురోభివృద్ధికి పార్టీ జెండా నీడన ముందుకెళ్లిపోవాలనుకునే నేతల్లో ఆయనొకరని చెప్పుకుంటున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రైవేటీకరణ చేస్తున్నా నోరుమెదపని వైనం సదరు అధికార అభ్యర్థి సొంతం. వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలే కాకుండా ప్లాంట్‌పై ఆధారపడి జీవించే వేల కుటుంబాలు, వ్యాపారాలు విశాఖపట్నం ప్రత్యేకత. ఇలాంటి మిగతా 2లో..

ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

సిపిఎస్‌ను రద్దు చేయండి

ఉద్యోగులపై వేధింపులు ఆపండి
సిపిఎం, సిపిఐ ధర్నాలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని, ఉద్యోగులపై వైసిపి ప్రభుత్వం తక్షణమే వేధింపులు ఆపాలని సిపిఎం, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆ రెండు పార్టీల ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట తప్పను, మడమ తిప్పనన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి నేడు సిపిఎస్ రద్దుకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు చేయాలని, బకాయి డిఎలు విడుదల చేయాలని పెద్దఎత్తున పోరాడుతుంటే ఆ పోరాటాలను అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం హేయమైన చర్యని అన్నారు. ఉద్యోగులు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ఆ కార్యక్రమం జరగనివ్వకుండా మిగతా 2లో..

సమర్థవంతంగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

వార్త 2లో..

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

వార్త 4లో..

ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

వార్త 3లో..

రక్షణ రంగ ఉద్యోగులతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

రక్షణ రంగ ఉద్యోగులకు అండగా ఉంటా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రక్షణ రంగ ఉద్యోగుల సమస్యలపై తాను పనిచేస్తానని, ఎల్లవేళలా వారికి అండగా ఉంటానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రక్షణ రంగ ఉద్యోగులను ఆమె కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపర్చి ఓటు వేయువలసిందిగా విజ్ఞప్తి చేశారు. రక్షణరంగ ఉద్యోగుల సమస్యలపై తనవంతు కృషి చేస్తానని, రక్షణ, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాసన మండలిలో తన వాణిని వినిపిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, మిగతా 2లో..

చేసిందిలేక.. మళ్లీ ఓట్లు అడగలేక..

- సిట్టింగ్ ఎమ్మెల్సీ మాధవ్‌పై విమర్శల వెల్లువ
- ఆయన మద్దతుదారులను నిలదీస్తున్న పట్టభద్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

బిజెపి నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్‌కు ప్రచారంలో ఎదురీత తప్పడంలేదు. గత ఎన్నికల్లో టిడిపి మద్దతుతో గట్టెక్కిన మాధవ్... తన పదవీ కాలంలో చేసిందిలేక, మళ్లీ ఓటేయాలని అడిగేందుకు ఓటర్లను కలవలేక ముఖంచాటేస్తున్నారు. మాధవ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ కార్యకర్తలకు పట్టభద్రుల నుంచి సమాధానం చెప్పుకోలేని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు మోడీ (బిజెపి) ప్రభుత్వం ప్రయివేటీకరిస్తోంది ? ప్రయివేటీకరణ ప్రమాదం నుంచి రక్షించడానికి చేసిన కృషి ఏంటి ? అడిగితే సమాధానంలేక బిక్కమొహం వేసుకొని కార్యకర్తలు వెనుదిరుగుతున్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు, విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్, జాతీయ విద్యా సంస్థల నిర్మాణం, ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్య, గిరిజన ప్రాంతంలో ఉపాధి నిధులను కాఫీ పంట ప్రోత్సాహకాల నుంచి తప్పించడం, జిఒ 3 పునరుద్ధరణ వంటి అంశాలపై పట్టించుకున్నదాఖలాల్లేవు. ఎమ్మెల్సీగా గెలిచిన ఆయన ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషి శూన్యమనే చెప్పాలి. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మీరు చేస్తున్న కృషి ఏంటని పలుమార్లు మీడియా సమావేశంలో ఆయన్ను, ఆ పార్టీ నాయకత్వాన్ని విలేకరులు అడిగినప్పుడు.. 'స్టీల్‌ప్లాంట్ ఎక్కడకు వెళ్తుంది ? ఇక్కడే ఉంటుంది' అని వ్యంగ్యంగా మాట్లాడ్డం తప్ప ఈ ప్రాంతవాసిగా ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు ఏ మాత్రమూ కృషిచేయలేదు.

బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్ (ఫైల్ ఫొటో)

రూర్బన్, స్టార్ విలేజ్ పథకం కింద స్మార్ట్ విలేజ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి నర్సీపట్నం పూర్వ బిజెపి ప్రధాన కార్యదర్శి ఇండిపూడి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రలోభాలే అజెండా

ప్రత్యేక పరిస్థితి చేజారిపోతున్నా పట్టని అధికార వైసిపిలో ఉన్న సదరు అభ్యర్థి స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారనే చెప్పాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని మోడీ సర్కారు కుట్రలపై కుట్రలు సాగిస్తున్నా ఉత్తరాంధ్ర పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నిస్తానని ప్రకటించిన దాఖలా లేదు.

సమస్యలపై ఏనాడూ గళమెత్తని అభ్యర్థి

విశాఖకు అత్యంత కీలకమైన రైల్వే జోన్‌పైనా కినుక వహించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసినా, ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక పరిపుష్టిని దెబ్బ తీసే చర్యలపైనా ఏనాడూ అధికార పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన ప్రస్తుత అభ్యర్థి గళమెత్తలేదు. వెనుకబడిన జిల్లాలుగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ముద్రపడ్డ శ్రీకాకుళం, విజయనగరం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కొంత ఆసరాగా నిలిచే విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ నగరంపై ఆధారపడి జీవించే వేల కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలున్నాయి. ఈ తరహా ప్రజా సమస్యల అజెండాపై పిడిఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మినహా ప్రస్తుతం బరిలో నిలిచిన తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు పోరాడడం కాదు కదా కనీసం ఏ కోసానా స్పందించలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఉత్తరాంధ్రకు రూ.వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ కేంద్రంలోని బిజెపి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసినా రాష్ట్రంలో 2019లో పగ్గాలు చేపట్టిన వైసిపి ఏనాడూ ప్రశ్నించలేదు. ఆ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇవేమీ పట్టడమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏ ముఖం పెట్టుకుని వారిని అధికార వైసిపి ఓట్లడగడానికి వెళ్తోంది అంటూ పట్టభద్రులే ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రలోభాలు...పంపకాలే అజెండా

చేతిలో అధికారం ఉండడంతో ఉద్యోగులు, అధికారులపై బెదిరింపులకు పాల్పడడం, ఎయు వైస్ ఛాన్సలర్ హోటల్‌లో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సంఘాలకు దొరికిపోవడం తెలిసిందే. ప్రభుత్వ వైన్ షాపుల్లోని సూపర్ వైజర్లు సైతం అధికార పార్టీకి అనుకూలంగా ఓటు ఓయాలంటూ శుక్రవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అధికార పార్టీ నేత కెకె.రాజు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించిన వీడియో బయటపడింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతటా తెలంగాణ రాష్ట్ర స్టిక్కర్లుండే కార్లను వినియోగించి వెండి వస్తువులను బహుమతులుగా శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్ తన ఇంటి నుంచి పంపిస్తున్న వీడియో, ఫొటోలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ అధికారిక అక్రమాలే. వీటన్నింటిపైనా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ పని ఆయన చేయడం లేదు.

13న పోలింగ్‌లో బుద్ధిచెప్పడం ఖాయం

అధికార వైసిపి కేవలం తన శక్తియుక్తులన్నీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు, ఇతర బహుమతులను పంపిణీ చేసే అంశాలపైనే దృష్టిసారించింది. చెప్పడానికి అజెండా లేదు. దొడ్డిదారులు, దొంగ పనులపైనే ఆ పార్టీ కార్యాచరణ ఉన్నట్టు కనిపిస్తోంది. వాటిని పట్టభద్రులు చైతన్యంతో తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికక్కడే వారి ఎత్తులను చిత్తు చేస్తున్నారు. పోలింగ్ రోజైన ఈ నెల 13న ఇదే ప్రతిబింబించనున్నదని పలువురు చెబుతున్నారు.

చేసిందిలేక.. మళ్లీ ఓట్లు అడగలేక..

సుధాకర్ లక్షల రూపాయలు వసూలు చేశారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు సహా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, రాయలసీమ ప్రాంతంలోని దాదాపు పదివేల మంది నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.400 కోట్ల వరకు వసూలుచేశారని పోలీసులు అంచనా వేస్తున్నారు. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిలో అత్యధికులు బిజెపికి చెందినవారు కావడంతో ఆ పార్టీ అప్పట్లో త్రిసభ్య కమిటీని నియమించింది. డబ్బుల వసూళ్లలో బిజెపికి చెందిన వివిధ స్థాయి నాయకులున్నారని కమిటీ తేల్చింది. కానీ వారిపై ఏ చర్యా తీసుకోలేదు. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసిన పార్టీ కార్యకర్తలపై చర్య తీసుకుంటామని 2021 ఆగస్టు 26న విశాఖ నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాధవ్ అన్నారు. ఉద్యోగాలిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన బిజెపి కార్యకర్తలపై ఈనాటికీ చర్య తీసుకోలేదు సరికదా... వారిని మాధవ్ కాపాడుకొస్తున్నారన్న విమర్శ నిరుద్యోగ బాధితుల నుంచి విన్పిస్తోంది. డబ్బులు వసూలుచేసి నిరుద్యోగులను మోసగించినవారే.. ఎమ్మెల్సీ మాధవ్‌కు మద్దతుగా నర్సీపట్నం, తదితర ప్రాంతంలో ప్రచారం చేయడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది. మోసపోయిన పట్టభద్రుల విషయమై మాధవ్ మాట్లాడకపోవడంతో పలుచోట్ల బిజెపి కార్యకర్తలను బాధిత పట్టభద్రులు నిలదీస్తున్నారు.

రక్షణ రంగ ఉద్యోగులకు అండగా ఉంటా

జెసిఎం సభ్యులు సిహెచ్.చిట్టిరాజు, క్యాంటీన్ కమిటీ సభ్యులు ఖాసిం, ఐఎన్‌సిఇ కో – ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి వైఎ.రాజేష్, ఎన్‌సిఇ ఆఫీస్ బేరర్స్ బి.భానోజీ, ఐ.గ్రెగరీ, వై.రాజేష్, జి.అరుణ్‌కుమార్, బి.జగదీష్, చింతా చిట్టిరాజు, కెవివిఎస్‌డి.కుమార్, డి.మోహన్‌రావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : గీతం విశ్వవిద్యాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రచారం చేపట్టారు.

సిపిఎస్‌ను రద్దు చేయండి

పోలీసుల సహకారంతో నిర్బంధాలను ప్రయోగించడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యోగులపై నిర్బంధాలు ప్రయోగించి వేటు వేస్తే, ఆ ప్రభుత్వాలు అధికారంలో లేకుండా చేసిన సంఘటనలను గుర్తుచేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అన్నారు. దీనిని బిజెపి, టిడిపి, వైసిపిలు ఒక సరుకుగా మార్చివేశాయన్నారు. పెన్షన్ డబ్బులు తీసుకువెళ్ళి షేర్ మార్కెట్‌లో పెట్టడం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార పార్టీ ఆంధ్రా యూనివర్శిటీ విసి, పూర్వ రిజిస్ట్రార్ లాంటి వారిని రంగంలో దింపి ఉద్యోగులను బెదిరించి ఈ ఎన్నికల్లో గెలవాలని చూడటం అవివేకమన్నారు. తక్షణమే అధికార దుర్వినియోగాన్ని, ఉద్యోగులపై వేధింపులను ఆపి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఉద్యోగుల పోరాటాలకు మద్దతుగా వామపక్ష పార్టీలు ప్రజా ఉద్యమానికి పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.రెహమాన్, వి.కృష్ణారావు, జి.రాంబాబు, పి.వెంకటరావు, సిఎన్.క్షేత్రపాల్, జి.జయ, గంగాధర్, కె.కుమారి, ఎ.దేముడమ్మ, వాసు, ఎన్.నాగభూషణం పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఆపాలి : యుటిఎఫ్

రాష్ట్ర ప్రభుత్వం టీచర్లపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ చర్యలకు బలైన ఉపాధ్యాయులకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, తాడాన అప్పారావు, సహాధ్యక్షులు కె.రాంబాబు, జిల్లా కోశాధికారి టిఆర్.అంబేద్కర్, జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, తాటికుంట జగన్, మహిళా విభాగం నాయకురాలు విజయ కుమారి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

సమర్థవంతంగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, లెక్కింపుపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ అన్నిటికంటే చాలా ముఖ్యమైన బాధ్యతని తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్, బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు చేర్చడం, లెక్కింపు ముఖ్య భాగాలని పేర్కొన్నారు. వైలెట్ స్కెచ్ పెన్ ఉపయోగించి వేసిన ఓట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎలెక్టోరల్ రోల్, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ చాలా ముఖ్యమైనవని అన్నారు. బ్యాలెట్ బాక్స్‌ను తెరిచే ముందు సంబంధిత ఏజెంట్లకు చూపించాలని అన్నారు. బాక్స్ యదార్థతను గమనించాలని తెలిపారు. లెక్కింపునకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్న కారణంగా లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో బిఎల్‌ఒలు ముందుగా స్థానిక సచివాలయంతో సమన్వయం చేసుకుని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు ఉండేటట్లు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నేను వి.పద్మావతి,
భర్త వి.అప్పలనాయుడు
నేను మర్రిపాలెం నుండి కంచరపాలెం వెళ్లుచుండగా నా పాస్‌పోర్టు ఉన్న బ్యాగ్ పోయినది.
నా పాస్‌పోర్టు నెం. జి 6837090
నా పోస్‌పోర్టు దొరికిన వారు దయచేసి ఈక్రింది అడ్రస్, నెంబర్‌కు తెలియజేయగలరు.

వి.పద్మావతి, భర్త వి.అప్పలనాయుడు
మసీదు స్ట్రీట్, మర్రిపాలెం, విశాఖపట్నం.
సెల్: 9581014385

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM
O.S.No. 1249 / 2021

Between:
Sri S.V.Nageswara Rao . . . Plaintiff
And:
Smt. Pasupuleti Surya Kumari . . . Defendant

PUBLICATION OF SUMMONS TO THE DEFENDANT BY WAY OF SUBSTITUTE SERVICE AS ORDERED BY THE HONOURABLE COURT

To,
Smt. Pasupuleti Surya Kumari,
W/o. Late Sri P.Raja Rao, Hindu
aged 61 years, Flat No. 401,
V Floor, Horizon Enclave, Pandimetta,
Maharanipeta Post,
Visakhapatnam-530002.

It is hereby informed that the plaintiff filed the suit against you for recovery of the amount due to him under the Promissory note executed and that the summons taken to the address given above has been returned un-served. Therefore on an application filed by the plaintiff for substitute service of summons by way of publication, it is here by informed that the suit filed by the Plaintiff stands posted to **04-04-2023 at 10-30 A.M**. in the honourable court for your appearance and answer the claim either in person or through an advocate failing which the honourable court would pass order setting you ex-parte.

S.NARYANA
I.V.MADHUSUDHANA RAO
Advocates,
13-1, MIG Vuda Flats,
Pithapuram Colony, VSP-3
Cell : 98480 79684,
950 59 84590
Visakhapatnam
Dt. 10-3-2023

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 81/2017 in O.S.No.259/2015

బిట్వీన్:
కొట్టాన చిన్నతల్లి . . . **D.Hr**
అండ్:
మడిసి కృష్ణారావు . . . **J.Dr**

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తము పై జడ్జిమెంటు డెటారు యొక్క ఈ క్రింది షెడ్యూలు ఆస్థిని తేది: 4-4-2023న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. కావున వేలం **తేది: 4-4-2023న ఉదయం గం. 10-30 ని॥ల నుండి సా॥ గం.5.00** మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలం పాటలో పాల్గొన దలచిన ఆసక్తి గల వారు పై తేదీన, పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్థి వివరములు

విశాఖపట్నం జిల్లా జి.వి.ఎం.సి. పరిధి, పెందుర్తి, చినముషిడివాడ గ్రామం, సప్తగిరి నగర్ ఏరియాలో వున్న, పార్వతీ రెసిడెన్సి అపార్టుమెంటు దాస్‌గార్డెన్స్, 2వ ఫ్లోర్, **SF-1, 750 Sft (Including Common areas & Boundaries), Flat No. 301** డో.నెం. 1-201, కలిగిన ఆస్థికి హద్దులు
తూర్పు : ఓపెన్ స్పేస్, దక్షిణం : లిఫ్ట్ కామన్ కారిడార్ **&** స్టెయిర్‌కేస్, పడమర : ఓపెన్ స్పేస్, ఉత్తరం ఓపెన్ స్పేస్

DHR Value : Rs. 15,00,000/-
Amin Value : Rs. 30,00,000/-
JDR Value : Nof Furnished
S.NAGESH KUMAR & POTHINA RAMBABU Advocates,
 # 10-4-30/1, Kaliash Nagar, Gajuwaka, Visakhapatnam - 26.
Cell : 98480 63531

ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు
O.S.No.1/2018

Between:
గోరపల్లి కృష్ణ వగైరాలు .....వాది
And:
1. తుంబలి దుర్గాప్రసాదరావు వగైరాలు .....ప్రతివాదులు.

ఇందుమూలంగా తెలియజేయనది ఇందులి వాదులు ప్రతివాదులపై దావా షెడ్యూల్ ఆస్తికి వాదులు పూర్తి హక్కుదారులు స్వాధీన అనుభవం కలిగియున్నారు అని దావా వేసిరి, ప్రతివాదులు 3. తుంబలి శివప్రసాదరావు, 4. తుంబలి వెంకటరమణ, 5. తుంబలి శ్రీరామ్ మూర్తి, 6. తుంబలి మురళీకృష్ణ ప్రతివాదులకు అనేక నోటీసులు, సమన్లు జారీ చేసిన తీసుకొనుటకు ఉద్దేశపూర్వకంగా తప్పించుకుని తిరుగుచున్నందున కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన సమన్లుగా భావించి **తే.31.03.2023దిన** స్వయంగా లేదా వకీల్ ద్వారా ఖుద్దునగాని హాజరై హక్కు నిర్ధారణకు మీ యొక్క ఆక్షేపణలు అభ్యంతరాలు తెలపగలరు లేనియెడల మీకు పరోక్షంగా డిగ్రీ జారీ కాబడును.

కోర్టు ఉత్తర్వులు మేరకు
జాగాన మధుసూదన్ రావు
వాది తరుపు న్యాయవాది
అడ్వకేట్ – పార్వతీపురం
సెల్ నంబర్-9440165169

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P. 74/2013 in O.S.1420/2012

Between :
Sri Eeda Rama Koteswara Rao ...D.Hr
And
Sri Pallikala Venkata Shyam Sundar Reddy & Another ...J.Dr's

PROCLAMATION SALE

Notice is hereby given that by an order of the Court named above the property mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. in a sum of Rs. 13,84,961/- up to the date of sale (excluding publication charges) in the aforesaid suit against the judgment debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10:30 A.M to 5:00 P.M** on **27-03-2023** at Public Court i.e **Principal Senior Civil Judge's Court, District Court Complex, Visakhapatnam District**. Public are further informed that no amount of Revenue, rent or any other local taxes are due and payable on the property mentioned in the schedule below.

At the sale the public are generally invited to bid, either personally or by duly authorized agent subject to terms and conditions of sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder

SCHEDULE OF PROPERTY

All the piece and parcel of land share situated within the Visakhapatnam Revenue District, Visakhapatnam Registration District, Urban Mandal of Greater Visakhapatnam Municipal Corporation, China Waltair Village, T.S. No. 988, Waltair Ward No.19, Division No.21, Block No.35. (Old D.No.7-1-53/1, New D.No.7-1-53) Assessment No.32/899 with A.P. Transco Electrical Consumption Installation therein an extent of 146 Sq.yards or 122.07 Sq.Mts with RCC staircase therein in plinth/floor area of 7300 Sq.feet.

"A" SCHEDULE PROPERTY

East: Kotam Salesiah School 39 feet or 117 Mtrs, **South:** House of Sri P. Suryanarayana 62 feet or 18.6 Mtrs, **West :** House of Sri Patnaik 39 feet or 1.7 Mtrs, **North:** 80 feet Road 62 feet or 18.6 Mtrs.

The share of the floors of the 01st Defendant as follows:
ITEM No's. 6 & 7. 01st FLOOR

ITEM No.6 - SHOP No. 2:

Undivided and unspecified share of 10 Sq. Yds/6-39 Sq.Mts plinth area 500 Sft. **East:** Shop No.2, **North:** 80 feet Road and common area, **South:** House of Sri P. Suryanarayana, **West:** Shop No.3. **Measurements: East to West:** 10 ft. or 3 Mts, **North to South:** 22 feet or 6.36 Mts.

ITEM No.7 - SHOP No. 3:

Undivided and unspecified share of 10 Sq. Yds/6-39 Sq.Mts plinth area 500 Sft. **East:** Shop No.2, **North:** 80 ft.Road and common area(Parking area),**South:** House of Sri P.Suryanarayana, **West:** Shop No.4 **Measurements: East to West :** 10 feet or 3 Mts, **North to South:**22 feet or 6.36 Mts.

Value of Decree Holder : Rs.20,00,000/-
Value of Field Assistant:Rs.14,00,000/-
Value of J.Dr not known.

T. PAVAN KUMAR, Advocate
Visakhapatnam. **Cell: 8790889289**

NOTICE UNDER ORDER 21 RULE 22 OF CPC IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
EP 153/2018 IN AA 792/2015

Between:
M/s. Shriram Transport Finance Company Ltd.,Dwaraka Nagar, Visakhapatnam rep., by its G.P.A Holder, M.V.Ravi Kumar ...DHr
And:
Reliable Stevedores Private Limited, rep by Arif Alikhan ...JDrs

NOTICE TO 1ST JDR

M/s. Reliable Stevedores Pvt Ltd
Rep by Arif Alikhan,
S/o. Ishaq Alikhan,
R/o. D.No. 14-37- 19,
Flat No.GC, Laxmi Enclave,
Maharanipeta, Visakhapatnam.

Whereas you have failed to satisfy an Award passed against you on 19-11-2015 in the A.A.792/2015 in favor of the Dhr for an amount of Rs. 28,04,854/- and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions in CPC to satisfy the EP amount of Rs.33,13,028/-.

Whereas it is ordered that notice under Order 21 rule 22 of CPC by way of this Publication Notice since you are avoiding to take notice. Therefore, it is ordered that you should attend to the court on **27-03-2023 at 10.30 AM** before the Court, in person or through your Advocate failing which the matter would be decided in your absence by setting you exparte.

Y.VIJAY SARADHI, Advocate,
Satyam, 53-40-35/1, KRM Colony,
Maddilapalem, Visakhapatnam.
Cell: 9494203040

మైనార్టీలను మోసగించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అధికారాలు లేని అధికారం కట్టబెట్టి, కీలుబొమ్మలు, రబ్బర్ స్టాంపులుగా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మార్చివేసి మైనార్టీలను మోసగిస్తోందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ ఆరోపించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ముస్లిం మైనార్టీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. మైనార్టీలకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తప్పుడు లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం చూపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సమితి లీగల్ టీమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షబ్బీర్, ఇమ్రాన్, ఇషాక్ మదీనా, అబ్దుల్ సత్తార్, షాహిద్ ఫారూఖ్ పాల్గొన్నారు.

13న సెలవు ప్రకటించండి

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : ఈనెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానంతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల శాసనమండలి సభ్యుల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో న్యాయవాద ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఆ రోజున కోర్టుకు సెలవు ప్రకటించాలని విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అభ్యర్థన లేఖ పంపించినట్లు తెలిపారు. 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు న్యాయవాదులు పోటీ బరిలో ఉన్నారని, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగస్తులు, కక్షిదారులు ఓటు వేసేందుకు వీలుగా ఆరోజున సెలవు దినంగా ప్రకటించాలని లేఖలో కోరినట్లు తెలిపారు.

ఘనంగా సిఐఎస్ఎఫ్ రైజింగ్ డే

ప్రజాశక్తి-ఉక్కునగరం : సిఐఎస్ఎఫ్ 54వ రైజింగ్ డేను విశాఖపట్నంలోనిసిఐఎస్ఎఫ్ యూనిట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ఇన్‌స్పెక్టర్ ప్రణబ్ నియోగ్ ఆధ్వర్యంలో నలుగురు సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కూడిన సెరిమోనియల్ పరేడ్ ప్రదర్శించారు. ఉత్తమ కవాతు దళానికి ట్రోఫీని ముఖ్యఅతిథి అతుల్‌భట్ అందించారు. యూనిట్‌లోని ముగ్గురు సిబ్బందికి ప్రతిభావంతులైన సేవకు గాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్కృష్ట్ సేవా పతకాలతో సత్కరించారు. డాగ్ స్క్వాడ్, మాక్ ఆపరేషన్ లైట్ డ్రిల్, మాస్ క్యాజువాలిటీ ఇన్సిడెంట్, రెస్క్యూ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథి అతుల్‌భట్‌ను విశాఖపట్నం సిఐఎస్ఎఫ్ యూనిట్ కమాండెంట్ అత్తర్ మహమ్మద్ హనీఫ్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, అధికారులు, సిఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, ఐబి అధికారులు, స్థానిక పోలీసు అధికారులు, స్టీల్ ప్లాంట్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి

విద్యుత్తు వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి- మధురవాడ : విద్యుత్తు వాహన రంగంలో విప్లవాత్మక మార్పుల నేపథ్యంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఐఐటి గాంధీనగర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాఘవన్ సూచించారు. విద్యుత్తు వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్, సంప్రదాయేతర ఇంధన వనరుల పాత్రపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇఇసిఇ) విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగాల మధ్య అంతర్ పరిశోధనలు అవసరమన్నారు. ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెన్‌లైన్ మాట్లాడుతూ పెరుగుతోన్న విద్యుత్తు వాహనాల వినియోగంతో తీవ్రం కానున్న విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకోవడానికి సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి, విద్యుత్తు నిల్వ సామర్థ్యం పెంపుదల అవసరమన్నారు. ఎమ్.ఇబ్రహీమ్, కె.అరవింద కుమార్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించిన వర్క్‌షాప్‌కు దేశంలోని పలు ప్రాంతాల నుంచి అధ్యాపకులు, పారిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు చకచకా ఏర్పాట్లు

భీమిలిలోని పోలింగ్ కేంద్రం (295,296)

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు భీమిలి డివిజన్‌లో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సంబంధిత అధికారుల పరిశీలన పూర్తయింది. ఈ నెల 13న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారితో పాటు మరో ఇద్దరు సహాయకులను నియమించనున్నారు. తో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. భీమిలి డివిజన్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు సంబంధించి 6,823 మంది ఓటర్లకు ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పద్మనాభం జెడ్‌పి హైస్కూల్ పోలింగ్ కేంద్రం (292)లో 1067 మంది, ఆనందపురం జెడ్‌పి హైస్కూల్ (293) 781 మంది, ఇక్కడే 294 పోలింగ్ కేంద్రంలో 819 మంది, భీమిలి మండల కేంద్రంలోని మూడవ వార్డు, ఎంఎఫ్ సి యుపి స్కూల్ (295)లో 1348 మంది, ఇదే కేంద్రంలోని 296పోలింగ్ బూత్‌లో 1396 మంది, చిట్టివలస, జీవిఎంసి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హైస్కూల్(297) పోలింగ్ కేంద్రంలో 1412 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భీమిలి డివిజన్‌లో మొత్తం ఓటర్లు 6,823 మంది ఉండగా, వారిలో పురుషులు 4,396, మహిళలు 2,426, ఇతరులు ఒకరు ఉన్నారు.

11 నుంచి మద్యం దుకాణాలు, బార్లు మూసివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు ఈ నెల 13న జరగనున్న నేపథ్యంలో, ఈ నెల 11నసాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ జరిగే 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు భీమిలి డివిజన్ పరిధిలో ఉన్న 29 మద్యం దుకాణాలు, ఆరుబార్లు మూతబడనున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సయిజ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. భీమిలి మండలంలో 13, ఆనందపురంలో 9, పద్మనాభం మండలంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు వివిధ రకాలైన ఆరు బార్లు మూత పడనున్నాయి. ఇందులో తగరపువలస, సంగివల స, ఆనందపురం మండలం వేములవలసల్లోని బార్లు, భీమిలి, బీచ్ రోడ్డు, తొట్లకొండ టూరిజం బార్లు, తిమ్మాపురం క్లబ్ ఉన్నాయి.

'ఉక్కు' పరిరక్షణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ చేపట్టిన పోరాటం రెండేళ్లు పూర్తి చేసుకుందని, ఆ ఉద్యమాన్ని భవిష్యత్తులో మరింత తీవ్రతరం చేస్తామని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 706వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగంలో నడుస్తున్న అన్ని సంస్థల్లో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పలు విభాగాలు పనిచేయకుండా నిర్వీర్యం చేసి, నష్టాలు చూపించి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట సంస్థలకు అమ్మి వేయడానికి చూడటం దుర్మార్గమన్నారు. ఈ చర్యలను అడ్డుకుంటామన్నారు. దీక్షల్లో కూర్చున్న వారిలో సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్, జి.అప్పలరాజు, వై.రాజు. కెఎస్.కోటేశ్వరరావు, జి.పోలేశ్వరరావు, పీతల అప్పారావు, బొడ్డ దేముడు, దండు నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై 'గీతం'లో అవగాహనా ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న గీతం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కేడెట్లు

ప్రజాశక్తి- మధురవాడ : ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, తగు జాగ్రత్తలతో వాహనాలను నడిపితే రహదారి ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని నివారించవచ్చునిగీతం సెక్యూరిటీ డైరెక్టర్ బి.వి.రమణకుమార్ అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్విభాగం ఆధ్వర్యంలో జాతీయభద్రత వారోత్సవాలలో భాగంగా రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.., మద్యం మత్తులో, సెల్‌ఫోనులో మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ, హెల్మెట్, సీటు బెల్టు ధరించి, మితమైన వేగంతో వాహనాలను నడిపితే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. వ్యక్తిత్వ వికాసంపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.ఎల్.సురేష్‌కుమార్, డాక్టర్ టి.దుర్గారావు, డాక్టర్ ఆర్.గోపీనాథ్, డాక్టర్ కె.సురేష్, టి.మాలతి, గీతం సేఫ్టీ విభాగం అధికారి కెపి.చక్రధర్ పాల్గొన్నారు. గీతం ఎన్‌సిసి కేడెట్లు, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాల్గొని రహదారి భద్రతపై బోర్డులు, బ్యానర్లను ప్రదర్శించారు.

15 నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -కంచరపాలెం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై 4.0) పథకం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెం పాత ఐటిఐ సమీపంలోని నరవ ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 15 నుండి నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు నరవ ఐటిఐ ప్రిన్సిపల్ బి విజయలక్ష్మి తెలిపారు.. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కస్టమైజ్ కోర్సు, సర్వీస్ టెక్నీషియన్ హోం అప్లయెన్సెస్, ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్ టెక్నీషియన్ (ఆపరేటర్) కోర్సులకు మూడు నెలల కాలవ్యవధిలో ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సి పాస్, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన వారు 18 నుండి 45ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులు అర్హులన్నారు .ఈనెల 13 నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకుని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు పొందవచ్చున్నారు ఆసక్తిగల అభ్యర్థులు 63057 83675, 70324 15161, నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

మృతుడు అప్పలనాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సంజీవమెట్ట వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురం గ్రామానికి చెందిన కొటాన అప్పలనాయుడు (54), అదే గ్రామానికి చెందిన దారపురెడ్డి నాయుడు తమ గ్రామం నుంచి కాశీపురం వైపు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో వెళ్తున్నారు. సంజీవమెట్ట దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. అనంతరం అక్కడ నుండి అతను పరారయ్యాడు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి వచ్చి గాయపడిన అప్పలనాయుడు, నాయుడును హుటాహుటిన కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించారు. అప్పటికే అప్పలనాయుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన దారపురెడ్డి నాయుడుకు చికిత్స అందించారు. మృతుడు అప్పలనాయుడుకు భార్య లక్ష్మి, వివాహితురాలైన కుమార్తె ఝాన్సీ, బీటెక్ చదువుతున్న కుమారుడు సురేష్ ఉన్నారు. గాజువాక సమీపంలోని నాతయ్యపాలెంలో కలిసిగా పనిచేస్తున్న నాయుడు తన తమ్ముడిని చూడటానికి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనతో సంజీవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ఉదయం ఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పలనాయుడు మృతిపై విచారం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న నాయుడుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ, గ్రామ పెద్దలు ఉన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు టీచర్లకు గాయాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు గాయపడిన సంఘటన మండలంలోని ఇరువాడ జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలో చీమలపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చేపల అచ్యుతరావు, పిఎస్ గుప్తా శుక్రవారం ద్విచక్ర వాహనం వెళ్తుండగా, ఇరువాడ జంక్షన్‌లో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -తగరపువలస : ఓ చెట్టు కొమ్మకు మెడకు తాడుతోఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్న ఘటన శుక్రవారంరాత్రి 2 గంటల సమయంలో చోటు చేసుకుంది. భీమిలి పోలీసుల కథనం ప్రకారం..భీమిలి మండలం రాజుల తాళ్ళవలస, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న పార్కింగ్ స్థలంలో గల బాదం చెట్టు కొమ్మ కు తాడు తో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్న ట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని జేబులో ఉన్న పర్స్ లో గల గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా మృతుని స్వస్థలంపశ్చిమ బెంగాల్ మండలా పారా కు చెందిన కాంచన్ మండల్ (44) గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -కంచరపాలెం : గొల్ల కంచరపాలెం గ్రామ అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కోదండ సీతారామ సంపత్ వెంకటేశ్వరస్వామి ధనలక్ష్మి దేవి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామసేవ సమాజం (యాదవ) ప్రతినిధులు పర్యవేక్షణలో రేజేటి శ్రీరామాచార్యులు, రేజేటి సీతారామచార్యులు విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, ఏర్పాటు వంటి క్రతువులను నిర్వహించారు. ఈ నెల. 11న శనివారం ఉదయం 10 గంటలకు సీతారాములు, వెంకటేశ్వరస్వామి కల్యాణాలను ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నసమారాధన ఉంటుందన్నారు.

కార్డియాక్ కేర్ వర్క్ షాప్

గుండె సంరక్షణపై వివరిస్తున్న వైద్యనిపుణులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండస్ ఆసుపత్రి నిర్వహణలో అంతర్జాతీయ స్థాయి ఉమెన్ కార్డియక్ కేర్పై వర్క్ షాప్ నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా విన్కార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుండె వ్యాధుల నిపుణులు దీనిలో పాల్గొని విలువైన సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల ద్వారా ఆరు లైవ్ కేర్ ట్రాన్స్మిషన్ ప్రెజెంటేషన్స్ అందించారు. అందులో భాగంగా విశాఖలోని ఇండస్ ఆసుపత్రిలో సీనియర్ మహిళా కార్డియాలజిస్టు డాక్టర్ వి.సుజాత లైవ్ ట్రాన్స్మిషన్ ప్రెజెంటేషన్ అందించారు. మహిళలకు వచ్చే కార్డియక్ వ్యాధులను వివరించారు. ఐవిఎల్ కాంప్లె, ఎంజియో ప్లాస్టీపై మాట్లాడారు. పలువురు సీనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

గెడ్డ కబ్జాకు సన్నాహాలు!

ప్రశ్నించిన సచివాలయ ఉద్యోగికి బెదిరింపులు

వ్యర్థాలు, ఇసుక బస్తాలు వేసి కప్పేస్తున్న గెడ్డ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇంటిని ఆనుకొని ఉన్న గెడ్డను కప్పేసి ఆపై కబ్జాకు సన్నాహాలు చేసుకుంటున్నాడు ఆ ఇంటి యజమాని. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సంబంధిత సచివాలయ టౌన్ప్లానింగ్ సెక్రటరీని బెదిరిస్తున్నాడు.

13వ వార్డు నగర శివారు ప్రాంతమైన ఎస్ఎస్ఎన్ నగర్లో ఓ వ్యక్తి తన ఇంటిని ఆనుకొని ఉన్న సుమారు 30 అడుగుల గెడ్డను డబ్రిస్తో, ఇసుక మూటలతో గెడ్డను చాలా వరకు పూడ్చి పెట్టేసాడు. 30 అడుగుల గెడ్డ ఐదు అడుగులకు కుచించుకు పోయేలా గెడ్డను కప్పేశాడు.. కప్పేసిన గెడ్డ స్థలాన్ని కబ్జాకు సన్నాహాలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్ళిన సచివాలయ ఉద్యోగి కప్పేసిన గెడ్డను ఫొటో తీసాడు. ఆ విషయం తెలుసుకున్న ఆ ఇంటి యజమాని సచివాలయం కార్యాలయానికి వెళ్లి తన స్థలానికి ఎందుకు ఫొటోలు తీసావని విధుల్లో ఉన్న ఆ ఉద్యోగికి బెదిరించాడు. తాను విలేకరినని, ఈ ప్రాంతంలో ఎన్ని ఆక్రమణలు, అనధికార కట్టడాలు జరుగుతున్నాయో తనకు తెలుసు అని బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు సంబంధిత సచివాలయ ఉద్యోగి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఇలాగే గెడ్డ అంచున ఉన్న వారందరూ ఇదే పంథాను కొనసాగిస్తే గెడ్డ పూర్తిగా కుచించుకు పోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీరు సజావుగా వెళ్ళే పరిస్థితి ఉండదు. దీంతో కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాలనీ సంఘం పెద్దలు ఎటువంటి అభ్యంతరం తెలపకపోవడంతో గెడ్డను కప్పేసిన వ్యక్తితో కుమ్మక్కయ్యి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గెడ్డను కప్పేస్తూ కబ్జాకు ప్రయత్నించిన వ్యక్తిపై రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పరిశీలించి, కబ్జాకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ఫుడ్ ఫెస్టివల్ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమ్ కుమారి

ప్రజాశక్తి- ములగాడ : విద్యార్థినులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, అందుకు అవసరమైన నిధులను సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్టివల్స్, యువజనోత్సవాల ద్వారా సమీకరించుకోవాలని సెయింట్ ఆన్స డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో 'సేవా కార్యక్రమాల నిర్వహణకు నిధుల సమీకరణకు ఫుడ్ ఫెస్టివల్'ను నిర్వహించారు. ఫాదర్ పుష్పరాజ్ ప్రారంభించిన ఫుడ్ ఫెస్టివల్లో కాలేజీకి చెందిన విద్యార్థులు వివిధ రకాల . పానీ పూరి, మురి మిక్సర్, చికెన్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, మాక్ టైల్, ఐస్ క్రీమ్స్, వెజ్ రోల్స్, వివిధ రకాల స్వీట్లు, బజ్జీలు వంటి ఆహార పదార్థాలను 30స్టాల్స్లో ప్రదర్శించారు. వాటి ద్వారా నిధులను సమీకరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సుపీరియల్ సిస్టర్ ఎల్సీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందరభగా విద్యార్థులకు పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఆర్కెస్ట్రా ద్వారా పాటలతో అలరించిన అనిల్,రవిలను సేవా పతకాలతో సత్కరించారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ బన్నీ ఆధ్వర్యంలో నృత్యాలు రంజింపజేశాయి. బన్నీని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా సన్మానించారు.

ఎన్ఎస్టిఎల్లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కరాస: డిఆర్డిఓ ప్రధాన నావికా ప్రయోగశాల ఎన్ఎస్టిఎల్లో జాతీయ భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ నెల 4 నుంచి 10 వరకు 'మా లక్ష్యం శూన్యం హాని' థీమ్తో నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సేఫ్టీ వాక్, సేఫ్టీ పోస్టర్, క్విజ్ పోటీ, ఫైర్ మాక్డ్రిల్ వంటి కార్యక్రమాలను అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. భద్రతా పోస్టర్లు వివిధ భద్రత సూచనలు ఆవిష్కరించారు.

ముగింపు కార్యక్రమంలో ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పని ప్రదేశంపై భద్రతపై అవగాహన కల్పిస్తున్న, ఎన్ఎస్టిఎల్ చేపడుతున్న చర్యలను వివరించారు. అసోసియేట్ డైరెక్టర్ పివిఎస్ గణేష్కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగాక తీసుకునే నివారణ చర్యలు కంటే, అసలు ప్రమాదాలే జరగకుండా చూడాల్సిన ఆవశ్యకతను వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త బివిఎస్ఎస్ కృష్ణ కుమార్, ఎన్.రవికుమార్, ఆర్.శ్రీహరి, ఎన్ఎస్టిఎల్ ప్రతినిధులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రామనాథ్ సెకండరీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

సైన్సు ఎగ్జిబిషన్ తిలకిస్తున్న కార్పొరేటర్ సురేష్

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ నైపుణ్యత సాధించాలని 60 వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ పివి సురేష్ అన్నారు.. శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలోని ఎస్విఎల్ఆర్కె ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఫెయిర్ను ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించి పలు సైన్స్ ప్రాజెక్టు నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు సైన్స్లో ప్రావీణ్యత సాధించాలంటే ఇలాంటి సైన్స్ ఫెయిర్లో ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : దేశంలో జాతీయ బ్యాంకుల్లోని ప్రజాధనాన్ని రుణాల పేరుతో అదానీ వంటి కార్పొరేట్లు కొల్లగొడుతుంటే, వారికి కేంద్రంలో ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అండగా ఉండడం దుర్మార్గమని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. శుక్రవారం 96వ వార్డు పెందుర్తి ఎస్బిఐ వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. ఈస ందర్భంగా కాంగ్రెస్ నేత రుత్తల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, ధరలు, పన్నుల రూపేణా ప్రజలపై లేనిపోని భారం మోపుతున్న బిజెపి ప్రభుత్వం, ఆదానీ, అంబానీలకు దన్నుగా ఉంటూ, వారు మరింత కుబేరులుగా మారేందుకు సహకరిస్తోందన్నారు. సామాన్య, పేద ప్రజల జీవనాన్ని దుర్భరం చేసే విధానాలను అవలంబిస్తున్న బిజెపికి రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ఛార్జి ఆడారి రమేష్ నాయుడు, షేక్ షఫీ, జి. వెంకటరావు, బివిఎస్ నాయుడు, గండి సన్నిబాబు, పరదేశి నాయుడు. వైఎస్ జగన్. పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకారం

ఎంపి విజయసాయిరెడ్డికి జ్ఞాపిక బహూకరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- సీతమ్మధార: నేవల్ డాక్యార్డ్ ఉద్యోగులకు సంపూర్ణ సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం సీతమ్మధారలోని ఎంపీ నివాసంలో విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నేవల్ డాక్యార్డ్ కెటిబి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవిలు ఆయనకు సింహాద్రినాథుడు జ్ఞాపికను బహూకరించారు. అనంతరం నేవల్ డాక్యార్డ్ కెటిబి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన భవనం ప్రారంభం, ఉద్యోగుల సమస్యలకు సంబంధించి పలు అంశాలను విజయసాయి దృష్టికి తీసుకెళ్లారు.ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి వైసిపి ప్రభుత్వం కృతనిశ్చయంతో సహకరిస్తుందని విజయసాయి రెడ్డి హామీ ఇచ్చారు.

మానవ హక్కుల పరిరక్షణ సమితి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా శ్రీను

జాగారపు శ్రీను

ప్రజాశక్తి - గాజువాక : అఖిల భారత మానవహక్కుల పరిరక్షణ సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా జాగరపు శ్రీనును నియమించినట్లు సంఘం చైర్మన్ షేక్ సిరజుద్దీన్ తెలిపారు. గాజువాక పరిసర ప్రాంతాల్లో శ్రీను చేపట్టిన సేవా కార్యక్రమాలు చూసి ఈ పదవి కేటాయించినట్లు వెల్లడించారు. ప్రాణాపాయంలో ఉన్న ఎంతోమందికి అండగా ఉండేవిధంగా రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. సంస్థకు పేరు తెచ్చే విధంగా నీతి, నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించి, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాగరపు శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సర పరీక్షలు, వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఇంటి నుండి పరీక్షా కేంద్రాల వరకు రోడ్డు రవాణా సంస్థ సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీచేశారు. శు క్రవారం ఆశీలు మెట్ట ఆర్టిసి కాంప్లెక్స్లోగల రీజినల్ మేనేజర్ కార్యాలయంలో పరీక్షల ఏర్పాట్లుపై సీతారాం ఆర్టీసీ, ఇంటర్మీడియట్, విద్యాశాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, ఆర్టీసీ చైల్డ్ లైన్, నోడల్ చైల్డ్ లైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ అధికారుల నుంచి సంబంధిత సమాచారాన్ని సేకరించారు.

పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు ఎన్ని ప్రత్యేక బస్సులు నడుపుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎం అప్పలరాజు, జిల్లా విద్యాశాఖ ప్రతినిధి గౌరీ శంకర్, ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ మెంబర్ జి.విశ్వనాధం, ఐసిడిఎస్ సిడిపిఓలు శ్రీలత, ఎంవి.రమణి కుమారి, ఆర్టీసీ చైల్డ్ లైన్ ప్రతినిధి రామకృష్ణ, 1098 జిల్లా కన్వీనర్ డేవిడ్ రాజు, జిల్లా బాలల సంరక్షణా విభాగం ప్రతినిధి ఆనంద్ పాల్గొన్నారు.

గాజువాక తహశీల్దారు కార్యాలయం ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్, పెందుర్తిలో ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

హామీని నిలబెట్టుకోమంటే అరెస్టులా...?

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-గాజువాక

ఉద్యోగ, ఉపాధ్యాయుల సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేఎం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గాజువాక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలోధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత అటకెక్కించడం దారుణమన్నారు. దీనిపై ప్రశ్నించి, ఆందోళన చేయాలనుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

సిపిఐ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా ఉంటామన్న ముఖ్యమంత్రి, వారిని నెలసరి జీతాలను సక్రమంగా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ తమ హక్కులపై ప్రశ్నించే ఉద్యోగ, ఉపాధ్యాయులను నిర్బంధాలకు గురిచేయడం సరికాదని, రానున్న రోజుల్లో దీనిపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం నేతలు ఎన్ రాజేంద్రప్రసాద్, ఎ.అయోధ్యారాం, అంగా లోకేష్, వై లక్ష్మణరావు, కె.సంతోషం, జి లక్ష్మి, ఎం.శ్రీదేవి కొవ్వూరు అప్పలరాజు, కె.కిరీటం, సిపిఐ నేతలు పల్లెటి పోలయ్య, ఎల్లేటి శ్రీనివాస్, ప్రజా సంఘాల నేతలు యమ జ్యోతి రాజశేఖర్, కె.రమణ, సిఐటియు నేత ఎన్ రామారావు, పాల్గొన్నారు.

పెందుర్తి: సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తుంటే, వాటిని నెరవేర్చకుండా వేధింపులకు గురిచేయడమే కాకుండా, అసలు నెలసరి జీతాలకు ఎసరు పెట్టేలా సిఎం జగన్మోహనరెడ్డి వ్యవహరిస్తున్నారని సిపిఎం, సిపిఐ నేతలు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక రైతుబజారు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శవర్గసభ్యులు జగన్, జిల్లా కమిటీ నాయకులూ బి.రమణి వారంరోజుల్లో సిపిఎస్ రద్దు హామీ నాలుగేళ్లు దాటినా అమలు చేయలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నుంచి కార్యకర్త వరకు వైసిపి నేతల అవినీతి పనులకు సహకరించని ఉద్యోగులను వేధించడం దుర్మార్గమన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ఇతర అన్ని హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు రాంబాబు, వామపక్ష కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు :ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల జిల్లా నాయకులు గండి నాయనబాబు, వేచలపు కాసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని విడనాడి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రూ.16,500 కోట్ల డిఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు గొర్లె దేవుడు బాబు, రొంగలి ముత్యాల నాయుడు, ఎర్రా దేముడు, వనము సూర్యనారాయణ , గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిపిఐ ఆధ్వర్యాన స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వం వాలంటీర్లను ఎందుకు ఉపయోగించుకుంటుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, కోన లక్ష్మణ, గొర్లె దేవుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేమల కన్నబాబు, వియ్యపు రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, వితన్నాల పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, కొల్లి సత్యారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడులో ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు, అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

అవగాహన శిబిరంలో పాల్గొన్న ఖాసీం, వినోద్‌బాబు, వెంకటరావు

రక్తదానంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని అయ్యన్న డిగ్రీ కాలేజీలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రక్తదానంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అయ్యన్న డిగ్రీ కాలేజీ డైరెక్టర్ ఎస్‌కె.ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రక్తదాన చైతన్యకర్త వినోద్ బాలు మాట్లాడుతూ రక్తదానం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణదాతలు కావచ్చని తెలిపారు. అందువల్ల ప్రతి బ్లడ్ డోనర్ దేవుడితో సమానమన్నారు. ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయొచ్చని చెప్పారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఈ నెల 12వ తేదీన ఆదివారం మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఆ శిబిరంలో రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ పిఒ జి.అప్పారావు, డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రమణ, సిబ్బంది, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రేమ సమాజం' స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం దాడి భోగ లింగం వారి విగ్రహం వద్ద ఉన్న ప్రేమ సమాజానికి చెందిన సుమారు కోటిన్నర రూపాయల విలువైన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ద రాజేష్ అధికారులకు విన్నవించారు. ప్రేమ సమాజానికి చెందిన సుమారు నాలుగు సెంట్ల స్థలంలో గత 30 ఏళ్లుగా చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ స్థలంపై కబ్జాదారులు కన్ను వేశారు. ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఎలాగైనా ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు చేస్తున్న కుట్రలకు కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జోనల్ కమిషనర్ వెంకటరమణ, 81వ డివిజన్ కార్పొరేటర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి అన్నారు. మండలంలోని తుమ్మపాల శారద వాలీ డెవలప్మెంట్ సమితి చిరుధాన్యాల చెల్లెల్ల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల వారోత్సవాల్లో భాగంగా మహిళ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యవతి మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాలను రాణిస్తున్నారన్నారు. విద్య వైద్యం రాజకీయ రంగాల్లో ప్రముఖులుగా ఉంటున్నారని, మహిళలు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాబార్డ్ ఏజియం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాలను ఎంతో ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని స్థానాలు సాధించిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు విష్ణుమూర్తి, సంస్థ కార్యదర్శి జోగినాయుడు, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

ఆడారి ఆనంద్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించిన నేపథ్యంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆనంద్‌కుమార్ ఘనంగా సన్మానించారు. బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం మండలాల నుంచి 100 మందికి పైగా ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విశాఖ డెయిరీ కార్యాలయంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను కలిసి పూలమాలలు, సాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాకారపు నాగరాజు, పైలా రాజు, గొంపా చినబాబు, కొల్లిమల్ల అచ్చింనాయుడు, దేవర అప్పారావు, కోరుకొండ అప్పలనాయుడు, సుంకర శ్రీనివాసరావు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న గేదెల సత్యనారాయణ తదితరులు

ఎన్‌టిపిసిలో ముగిసిన భద్రతా వారోత్సవాలు

వివిధ పోటీల్లో విజేతలతో ఎన్‌టిపిసి అధికారులు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్టీపీసీ సింహాద్రిలో ఈనెల 4 నుండి జరుగుతున్న 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ప్లాంట్ ఆవరణలోని సేఫ్టీ పార్కులో జరిగిన ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, సింహాద్రి గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, జీఎమ్ డిపి.పాత్ర, ప్రాజెక్టు జీఎమ్ ఎస్‌కె.ఝా, హెచ్ఆర్ రుమా దే శర్మ పాల్గొని భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథి వి.సురేష్ మాట్లాడుతూ వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత నిర్వహణలో సింహాద్రి ప్రాజెక్ట్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సింహాద్రి జీఎమ్ సిన్హా మాట్లాడుతూ సింహాద్రి స్టేషన్‌లో ప్రమాద రహిత పని వాతావరణాన్ని పెంపొందించడానికి మేనేజ్‌మెంట్ కట్టుబడి ఉందని తెలిపారు. జీఎమ్ డిపి.పాత్ర మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు అన్ని భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. జీవితంలో భద్రత ప్రాముఖ్యతపై సేఫ్టీ స్కిట్‌ను సేఫ్టీ స్టీవార్డ్ ప్లే చేశారు. దీనికి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. ఈ వారం రోజుల్లో వ్యాస రచన, స్కిట్ పోటీలు, స్లోగన్ కంప్లీషన్, సేఫ్టీ క్విజ్ కంప్లీషన్స్, సేఫ్టీ పోస్టర్స్ కంప్లీషన్స్, క్లోరిన్ లీక్ అరెస్ట్ కంప్లీషన్ వంటి వివిధ భద్రతా పోటీలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు, సింహాద్రి కాంట్రాక్టింగ్ అసోసియేట్స్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు

అదానీ అవకతవకలపై కాంగ్రెస్‌ నిరసన

ప్రజాశక్తి - పరవాడ

అదాని సంస్థలలో జరుగుతున్న ఆర్థిక అవకతవకలపై జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ వేయాలని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు కెఎస్‌ఎ.రామయ్య నాయుడు ఆధ్వర్యంలో లంకెలపాలెం వద్ద ఉన్న భారతీయ స్టేట్‌ బ్యాంకు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామయ్య నాయుడు మాట్లాడుతూ దేశ ప్రజల ఆస్తి భారతీయ స్టేట్‌ బ్యాంకు, భారతీయ జీవిత బీమా సంస్థల మనుగడ దెబ్బతినేలా సుమారుగా 50,000 కోట్ల రూపాయలు అప్పుగా అదాని సంస్థలు తీసుకొని ఆర్థిక నేరానికి పాల్పడ్డారని తెలిపారు. గడిచిన 9 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌ సంస్థలకు దొడ్డి దారిలో అప్పులు ఇప్పిస్తుందన్నారు. అనేక మార్లు రాహుల్‌ గాంధీ చెప్పిన విషయాన్ని అదాని సంస్థలపై హిండెన్‌ బర్గ్‌ జరిపిన పరిశోధన నివేదికలో తేటతెల్లమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ఆర్‌ఆర్‌ నాయుడు, విన్నకోట రాము, బిఎస్‌ నాయుడు, కత్తెర శ్రీధర్‌, మలపు రెడ్డి కోటేశ్వరరావు, బోయిన భాను మూర్తి యాదవ్‌, సూరిశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మాతె సువర్ణ (11) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందింది. ప్రాథమిక సమాచారం ప్రకారం... శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మాతె సువర్ణకు ఫిట్స్‌ రావడంతో ఆమె అకస్మాత్తుగా కిందపడిపోయి నురగలు కక్కుకుంటుంది. ఇది గమనించిన పాఠశాల అధికారులు హుటాహుటిన కంఠారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు సువర్ణ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతురాలి స్వగ్రామం నాతవరం మండలం, సుందరకోట పంచాయితీ పరిధి తొరడ. శుక్రవారం సాయంత్రం విద్యార్థిని మృత దేహాన్ని తల్లిదండ్రులకు అప్పటించినట్టు తెలిసింది. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

గోదావరి డెల్టాకు నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు : గోదావరి డెల్టా పంట పొలాలకు సీలేరు కాంప్లెక్స్‌ పరిధి డొంకరాయి జలాశయం నుండి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2500 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎస్‌ఈ సివిల్‌ కెవి.ప్రశాంత్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 8 వరకు గోదావరి డెల్టాకు రోజుకు 3000 క్యూసెక్కుల చొప్పున 5.26 టీఎంసీలు నీటిని డొంకరాయి జలాశయం ద్వారా గోదావరి డెల్టాకు నీటి విడుదల చేసినట్లు చెప్పారు. సీలేరు కాంప్లెక్స్‌ పరిధి సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్‌ కేంద్రాల్లో విద్యుత్‌ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టాకు విడుదలయ్యేదని పేర్కొన్నారు. ఏపీ జెన్కో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఈనెల 8న సాయంత్రం నుంచి నీటి విడుదలను నిలిపివేశామన్నారు. మళ్లీ గోదావరి డెల్టాకు నీటి అవసరాలు ఉండడంతో ఇరిగేషన్‌ అధికారులు రోజుకు 2500 క్యూసెక్కులు నీటిని విడుదల చేయాలని కోరడంతో ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9 గంటలకు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా 2500 క్యూసెక్కుల విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈనెల చివర వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. జల విద్యుత్‌ కేంద్రాల్లో విద్యుత్‌ అనంతరం యథాతథంగా 4000 క్యూసెక్కుల నీరు గోదావరి డెల్టాకు విడుదలవుతుందని వెల్లడించారు. జోలాపుట్‌ బలిమెల, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో ఆంధ్ర వాటా 25 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని, సీలేరు కాంప్లెక్స్‌ పరిధిలో జల విద్యుత్‌ కేంద్రాల్లో విద్యుత్‌ ఉత్పత్తికి, తాగునీటికి జూన్‌ చివరి వరకు పొదుపుగా వినియోగించుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం

మునగపాకలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ

ప్రజాశక్తి - మునగపాక రూరల్‌

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డిఎల్‌డిఓ మంజుల వాణి కోరారు. మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌-1ను శుక్రవారం ఆమె సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. నిర్మాణంలో వారికి తలెత్తే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్‌, ఇన్‌ఛార్జి తహశీల్దారు వినయ్‌ కుమార్‌, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని విస్సన్నపేట, జమాదులపాలెం గ్రామంలో జగనన్న లే అవుట్లను మండల ప్రత్యేక అధికారి రోజారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు ఉగాది నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు, సర్పంచ్‌ ఉప్పు నూరి మాణిక్యం, హౌసింగ్‌ డిఇ మధురరాణి, ఎఇ శ్రీనివాసరావు గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని గొడిచెర్లలో జగనన్న లేఅవుట్‌లో చేపడుతున్న గృహ నిర్మాణ పనులను ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. శుక్రవారం ఆయన హౌసింగ్‌ ఏఈ రాజు, పంచాయతీ కార్యదర్శి సాయి లక్ష్మి, వైసిపి నాయకులు అల్లు రమణ, వర్క్‌ ఇన్స్పెక్టర్‌, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్‌లతో కలిసి గృహ నిర్మాణం పనులను పరిశీలించారు. వేగంగా ఇంటి నిర్మాణం పనులను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరితగతిన ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్‌ అధికారులకు సూచించారు.

కశింకోట మండలంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కోటవురట్ల : జగనన్న గృహాలు ఉగాది నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. లింగాపురం గ్రామంలో జగనన్న కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, అందుకు సంబంధించిన బిల్లులు సకాలంలో అందజేయాలని సిబ్బందికి సూచించారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నిర్మాణాలకు సిమెంట్‌ కొరతపై ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌, హౌసింగ్‌ జగదీశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్‌ ఏఈ కరుణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు ఉద్యోగులకు వెసులుబాటు

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కలెక్టర్‌ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పనిచేసే పట్టభద్రులైన ఓటర్లకు ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించాల్సిందిగా సంబంధిత యాజమాన్యాలను కలెక్టర్‌ రవి పఠాన్‌ శెట్టి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు తమ కార్మికులు, ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలు కల్పిస్తూ విధులకు ఆలస్యంగా హాజరు కావడం, అనుమతులు, షిఫ్టుల సర్దుబాటు, పనిగంటలు తగ్గించడం వంటి సర్దుబాటు చేయాలని కోరారు.

13న స్పందన కార్యక్రమం రద్దు

ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13 సోమవారం జరుగుతున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్‌ ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

అన్నమయ్య పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి శారద బ్రిడ్జ్‌ సమీపంలో తుప్పలు డొంకలతో నిండి ఉన్న అన్నమయ్య పార్కును తక్షణమే అభివృద్ధి చేయాలని కోరుతూ శుక్రవారం సిద్ధార్థ సోషల్‌ సర్వీస్‌ అండ్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం మాట్లాడుతూ గతంలో ఈ పార్కు సర్వాంగ సుందరంగా ఉండి వేసవి రోజుల్లో వృద్ధులకు, పిల్లలకు, పట్టణ ప్రజలకు సేద తీరేందుకు అనువుగా ఉండేదని తెలిపారు. నేడు తుప్పలు డొంకలతో అసాంఘిక చర్యలకు నెలవుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జీవీఎంసీ జోనల్‌ కమిషనర్‌ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, ఆర్‌.మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

నంగినారపాడు హైస్కూల్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ బి.రమేష్‌ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలు జరుగుచున్న విద్యా సంబంధిత కార్యక్రమాలను పరిశీలించారు. 6, 7, 8 తరగతులలో అమలు జరుగుచున్న అభ్యాసానాభివృద్ధి కార్యక్రమం గురించి, బైజ్యూస్‌ ట్యాబ్స్‌ వినియోగిస్తున్న విధానాన్ని గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు "తరల్‌" బోధిస్తున్న తీరు, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా బోధనా కార్యక్రమం "కక్ష" గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో రక్తహీనత గల బాలికలను గుర్తించి వారికి పాఠశాల హెల్త్‌ అంబాసిడర్‌ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన సమయంలో దగ్గరుండి వారిచే తినిపించాలని, రెగ్యులర్‌గా ఐరన్‌ మాత్రలను వేయాలని కోరారు. 10వ తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి ఎస్‌.అప్పలరాజు, ప్రధానోపాధ్యాయులు ఆర్‌వి.జగదీష్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

పోలింగ్‌ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్‌

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని జోనల్‌ ఆఫీసర్‌ ప్రభాకర్‌ రావు, రూట్‌ ఆఫీసర్‌ బి.ఎర్ర పాత్రుడు శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్‌ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రత చర్యలపై చర్చించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎంపీడీవో రవికుమార్‌, వీఆర్వో బిందు ఉన్నారు.

పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

వ్యవస్థలను నాశనం చేసిన జగన్‌

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌ రెడ్డికే దక్కుతుందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. మార్పు కోసం ముందుకు సాగాలి పేరుతో శుక్రవారం సైకిల్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని 19వ స్థానానికి దిగజార్చారని ఎద్దేవా చేశారు. జగన్‌ రెడ్డి అసమర్థ పాలనలో నిరుద్యోగులు ఉద్యోగాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేస్తామన్న హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్‌ కు కేరాఫ్‌ అడ్రస్‌ గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్‌ కెకెవి.నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరే సతీష్‌, డివిది అప్పారావు, విల్లూరి మాధవ, బుద్ద శ్రీను, తిమ్మాపాత్రుని సూర్యనారాయణ, మళ్ల గణేష్‌, కుప్పిలి జగన్మోహన్‌, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

14న డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

నక్కపల్లిలో మాత్రలు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 14న మంగళవారం నిర్వహించనున్న డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గొడిచెర్ల పిహెచ్ సి వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఎంఈఓ డివిడి ప్రసాద్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు, అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. వైద్యులు కిషోర్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో 15,105 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం మాత్రలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అందజేశారు.

కోటవురట్ల: ఈనెల 14న నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి అధికారులు సహకరించాలని పిహెచ్‌సి వైద్యులు సంతోష్ కుమార్ తెలిపారు. మండల సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా దాదాపు 4286 మందికి నులి పురుగులు మందు అందజేయాల్సి ఉందన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో చంద్రశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అప్పారావు, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: 14న నులిపురుగులు మందులు పంపిణీ చేయాలని ఎంపీడీ అరుణ శ్రీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీవిద్య, బూరుగుపాలెం పిహెచ్సి సిబ్బంది, అంగన్వాడిలు పాల్గొన్నారు.

యస్.రాయవరం ఎంపిడివో కార్యాలయంలో డి వార్మింగ్ డే సందర్భంగా వైద్య సిబ్బందికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యాధికారులు శక్తి ప్రియ, నాయక్, ఎంఈఓ మూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అదనపు డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శారదాబాయి చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఏడాది వయసు నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు వారికి భోజనం అనంతరం ఈ మాత్రలు మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సిఆర్‌కే దేవరాయలు వైద్యులు డాక్టర్ రజిని, కళ్యాణి, ఆరోగ్య పర్యవేక్షకులు ఏరుకు నాయుడు, హెల్త్ అసిస్టెంట్ లండ అప్పలకొండ పాల్గొన్నారు.

కశింకోట : పులి పురుగుల నివారణ మాత్రలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి రోజారాణి పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లలు తిండి ఇష్టపడక పోవడం జరుగుతుందని, అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కొంకి అప్పారావు, కశింకోట, తాళ్ళపాలెం వైద్యాధికారులు తిరుపతి రావు, రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రమేష్, అభిషేక్ అంగన్వాడీ సూపర్ వైజర్ ఝాన్సీ రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ఏడాది నుంచి 19ఏళ్ల వయస్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వేయించనున్నట్లు ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కోరాడ శైలజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయుల, .అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించి, మాత్రలను అందజేశారు. డాక్టర్ సెహనాజ్, హెల్త్ సూపర్‌వైజర్ ఐ. గోవిందరావు. సెక్రెటరీ కరుణాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఫార్మసిస్ట్ జయకుమార్. హెల్త్ అసిస్టెంట్‌లు సత్తిరాజు. తారకేష్ పాల్గొన్నారు.

మైక్ సెట్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హైస్కూల్‌కు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు మైక్ సెట్ బహూకరించారు. పూర్వ విద్యార్థులంతా అపూర్వ కలయిక పేరుతో హెూటల్ జాస్ లో సందడి చేశారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారంతా నక్కపల్లి హైస్కూల్‌ను సందర్శించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలకు అవసరమైన 40 వేల విలువ చేసే మైక్ సెట్‌ను పాఠశాల ఉపాధ్యాయులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, సత్యవతి, పీడీ కుందూరు రాజు, సుందరరావు, సత్తిబాబు, అరుణ, రమణ, భవాని, సుమబిందు, పద్మావతి, పూర్వ విద్యార్థులు జె.వి. ప్రభాకర్, రాజారావు, ఎం.నాగేశ్వరావు, ఆర్. నాగేశ్వరరావు, దయాకర్, తాతాజీ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ లో భద్రపరుస్తున్న ప్రశ్న పత్రాలు

పోలీస్‌స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రశ్నాపత్రాలు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కే.శైలజ, రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ శారదా, పలువురు అధ్యాపకులు ప్రశ్నాపత్రాలను సరి చూసుకొని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈనెల 15 నుండి 29 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మాకవరపాలెం మండలం వజ్రగడ పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన వైసిపికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరాయి. శుక్రవారం స్థానిక ఎన్జీఓ హెూమ్‌లో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర సమక్షంలో వీరంతా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, మున్సిపాలిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

11న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అల్లూరి యవ గిరిజన సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11న స్థానిక సంపత్ వినాయక మెడికల్ ల్యాబ్ వద్ద మదర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని అల్లూరి యువ గిరిజన సేవా సంఘం అద్యక్షులు టి.మల్లేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సేవా సంఘం ఆధ్వర్యంలో మూడో సారి ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. రక్తదానంతో అనేక మంది ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. వివరాలకు కోసం పోన్: 7382063211 (మల్లేష్, 9494520761 (పి.సన్యాసిరావు)లను సంప్రదించాలన్నారు.

గుళికలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

విత్తన గుళికలు సిద్ధం

ప్రజాశక్తి-రోలుగుంట: మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన గుళికలు తయారు చేశారు. సమ్మర్ డ్రై షోయింగ్ పంట సాగుకు అనువైన విత్తనాలు సేకరణ, పొలంలో వేయడ కోసం విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట మండలం వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నెలకొంది. డ్రైనేజీలో నీరు నిండి రోడ్లపై పారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకు ఎంపి మాధవి అత్తారింటికి వెనుక రోడ్డులో డ్రైనేజీలు మట్టితో నిండిపోయి మురుగునీరు రోడ్లపై పారుతున్నా పట్టించుకునే నాధుడు లేరని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపై చేరిన మురుగునీరు

మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి -యస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో ఫ్రై డే... డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణాధికారి వరహాలు ఆదేశాల మేరకు యాంటీ లార్వా ఆపరేషన్లు చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా మండల కేంద్రంలో రెవిన్యూ కార్యాలయం ఎదురుగా ఉన్న మురుగు నీటి కాలువల పరిసరాలు వైద్య సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు నాగేశ్వరరావు, బి.సత్యన్నారాయణ, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, స్థానిక సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పరిశీలిస్తున్న అధికారులు

గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-చీడికాడ : మండలంలోని అడవి అగ్రహారం గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ప్రారంభించారు. చీడికాడ పశువైద్యశాల పశువైద్యాధికారి గాయత్రీ దేవి ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు చేపట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు నెలల వయసు దాటిన ప్రతి పాడి పశువు కు టీకాలు వేయించుకోవాలన్నారు. రైతులకు పశువైద్యం అత్యవసరమైతే 1962 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి సేవలు వినియోగించు కోవాలన్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైలపూడి, జైతవరం గ్రామ పశుసంవర్ధక సహాయకులు గంగు నాయుడు, శ్రీనివాసరావు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పోలీస్ స్టేషన్ లో భద్రపరుస్తున్న ప్రశ్న పత్రాలు

వేతనాలు చెల్లించరూ..

ప్రజాశక్తి రావికమతం : స్వచ్ఛభారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన నియమించిన గ్రీన్ అంబాసిడర్స్‌కు వేతనాలు చెల్లించాలని మండలంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారివరహాలు కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కవగుంట గ్రామ పంచాయతీకి ఒక అంబాసిడర్, ఒక గ్రీన్ గార్డ్‌ను నియమించారన్నారు. వీరికి గత ఏడాది వరకు స్వచ్ఛభారత్ పేరుతో వేతనాలు ఇచ్చారని, తర్వాత నుంచి నిధులు లేపోవడంతో చెల్లించ లేని పరిస్థితి నెలకొందన్నారు. మండలంలో కూడా పలు గ్రామాల్లో వీరు జీతాలు లేక పస్తులతో ఆలమటిస్తున్నారన్నారు.

అరటి తోట దగ్ధం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం జెడ్. కొత్త పట్నం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధమై సుమారు లక్షా 50 వేలు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన లాలం అప్పలనాయుడు, మరో రైతు రాజబాబు నుంచి సుమారు రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకోని అరటి తోట సాగు చేస్తున్నాడు. పక్వానికి వచ్చిన తోట శుక్రవారం ఆకస్మికంగా జరిగిన అగ్ని ప్రమాదంలో తోట దగ్ధమైంది.

ఆందోళన చేపడుతున్న దళిత సంఘాల నేతలు

హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని

దళిత సంఘాల ఆందోళన

ప్రజాశక్తి -పాయకరావుపేట:మండలంలోని పిఎల్ పురం గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్రను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని, హైకోర్ట్ జడ్జితో జ్యూడిషల్ విచారణ డిమాండ్ చేస్తూ శుక్రవారం దళిత బహుజన పార్టీ, ఎస్సీచ ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పాయకరావుపేట పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక గౌతమి థియేటర్ నుంచి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ, నాగేంద్రను హత్య చేసిన ప్రధాన నిందితులను అధికార పార్టీ అండదండలతో పోలీస్ యంత్రాంగం విచారణ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, పార్టీ పాయకరావుపేట టౌన్ అధ్యక్షులు జెక్కల సూరిబాబు, చిరుకూరి అర్జున్ రావు, ఐక్య వేదిక కన్వీనర్ తాటిపర్తి అప్పారావు యాదవ్, అధ్యక్షులు ఇలపు నాగబాబు, రెల్లి. వర్కింగ్ ప్రెసిడెంట్ మార్తి సింహాచలం, కార్యదర్శి గంటేటి చిట్టిబాబు, మాలమహానాడు అసెంబ్లీ ఇంచార్జ్ జయబాబు, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్. పెదపాడటి. నూకరాజు, సైనిక్ దళ్ జిల్లా కెప్టెన్ బోడపాటి సురేష్, టౌన్ మహిళా అధ్యక్షురాలు బోడపాటి లక్ష్మి పాల్గొన్నారు.

దేవస్థానం భూముల వేలంపాట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలో తలుపులమ్మ దేవస్థానం భూముల 3 సంవత్సరాల కౌలు హక్కు నిమిత్తం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. మొదటి పాటగా 182 సర్వే నెంబర్ 3.69 ఎకరాల మెట్ట భూమిని రూ.58వేల 500 రూపాయలకు పైడా రాజాకు, రెండవ పాట 159 సర్వే నెంబర్లలో 82 సెంట్ల పల్లం భూమిని రూ.17వేలకు గొల్లు రాజ్ మాణిక్యంకు వేలంపాట ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ సత్తిబాబు, గ్రామ పెద్దలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వేలంలో పాల్గొన్న పాటదారులు

'ఫుడ్ ప్రోసెసింగ్'లో అపార అవకాశాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఫుడ్ ప్రోసెసింగ్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్-ఫెసిలిటేషన్ ఆఫీస్, ఎయు ఐపిఆర్ చెయిర్, ఎపి చాంబర్స్, టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సంయుక్తంగా నిర్వహించిన 'ఫుడ్ ప్రోసెసింగ్ ఇండస్ట్రీస్'పై జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫుడ్ ప్రొడక్షన్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. డిఎఫ్ఆర్ఎల్, ఎపి ఫుడ్ సొసైటీతో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నూతన ఆలోచలతో వచ్చే యువతకు ఆర్థిక సహకారం అందించడానికి అనేక మంది పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారు. ఆహార ఉత్పత్తి రంగానికి డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు.

ఎయు పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆహార వృథాను నియంత్రిస్తూ, వ్యవసాయరంగానికి లాభదాయకంగా ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటుకావాలన్నారు. ఎపి చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో పనిచేసేవారికి వైవిధ్యమైన అవకాశాలు ఉన్నాయన్నారు.

కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

అనకాపల్లిలో చేపడుతున్న ప్రచారం

ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు చోట్ల కరపత్రాలు పంచుతూ పట్టభద్రులను ప్రజా సంఘాల నేతలు కలిశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి:ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల సమస్యలపై శాసనమండలిలో తమ గళాన్ని వినిపించేందుకు ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులైన సిబ్బందిని కలిసి రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు మాట్లాడుతూ ప్రజా గళాన్ని వినిపించే కేవలం 10 ఎమ్మెల్సీ స్థానాలు మాత్రమే పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు కేటాయించారని, వాటిని కూడా రాజకీయ పార్టీలు ఆక్రమించుకుంటే ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తే వారే ఉండరని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, బి ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీను, కాళ్ల తేలయ్య బాబు, భాస్కర్ రావు, ఎస్ రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలో చౌడేపల్లి, కుమార పురం, అచ్యుతాపురం సంతలో శుక్రవారం డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె.సోమినాయుడు విస్తృతంగా ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి రమాప్రభకు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆయన ప్రచారం చేశారు.

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ఆధ్వర్యాన ఎలమంచిలి మండలంలో ప్రచారం చేశారు. ఎలమంచిలిలో న్యాయవాదులను, జంపపాలెం, సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లిటౌన్‌లో ప్రైవేట్ స్కూళ్లలో పట్టపద్రులను కలిసి రమాప్రభని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సన్యాసిరావు మాస్టారు, సిపిఎం అభిమాని పద్మనాభరావు, కోరుమిల్లి సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు మండలంలోని అమృతపురం, సూరెడ్డి పాలెం, గొర్లివాని పాలెం, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజి, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ నాయకులు మొల్లేటి గౌరీశ్వర రావు, ఎర్ర సోంబాబు పాల్గొన్నారు.

రమాప్రభకు మద్దతుగా సిపిఐ ప్రచారం

అనకాపల్లి : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిపిఐ, ఏఐటియుసి, విద్యార్థి సంఘాలు శుక్రవారం ప్రచారం నిర్వహించాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ శాసనమండలికి మేధావులను పంపడానికి బదులుగా జగన్మోహన్ రెడ్డి వ్యాపారస్తులను, మద్యం ఇసుక కాంట్రాక్టర్లను పంపించే చర్యలకు పూనుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ, దేవుడు బాబు, ఫణీంద్ర, వి.రాజు, వి కన్నబాబు, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి

పెందుర్తిలో...

గాజువాకలో..

డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ 94వ వార్డు రవినగర్ భాష్యం పాఠశాలలో ప్రజా సంఘాల నేతలు కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నేత బి. రమణి మాట్లాడుతూ శాసమండలిలో ఉత్తరాంధ్ర సమస్యలు, నిరుద్యోగుల వాణి వినిపించాలంటే అది పిడిఎఫ్ అభ్యర్థుల వల్లే సాధ్యమన్నారు. ప్రశ్నించే తత్వం, పోరాడే మనస్తత్వం, చిత్తశుద్ధి ఉన్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ప్రధమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

గాజువాక :ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపు కోరుతూ జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు ఎస్‌వికె పరుశురాం ఆధ్వర్యంలో లంకెలపాలెం, అగనంపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో విద్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలకు, పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రజాసంఘాల మద్దతుతో పోటీలో ఉన్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. బడ్జెట్ స్కూల్ సమస్యల పరిష్కారానికి రమాప్రభ గెలుపు అవసరాన్ని వివరించారు.

భెల్ కార్మికుల మద్దతు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు భెల్ కార్మిక ప్రతినిధులైన, సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటివి ప్రకాష్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి పివిఎన్ రాజు తమ మద్దతు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో 250 ప్రజాసంఘాల మద్దతునిస్తున్న రమాప్రభకు తమ మద్దతు ఉంటుందన్నారు. అన్ని కార్మిక సంఘాలతో కార్మిక సమస్యలపై పనిచేసిన అనుభవం రమాప్రభకు ఉందన్నారు. ఉత్తరాంధ్ర వాణి, కార్మిక, కర్షక, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించి, ప్రశ్నించే సత్తా డాక్టర్ రమాప్రభకు ఉందని, అందుకే కార్మికసంఘాల తరపున ఆమెకు మద్దతు ప్రకటించినట్లు వెల్లడించారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి

-కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మన్యంలో ముమ్మరంగా ప్రచారం

అనంతగిరిలో ప్రచారం చేపడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు:. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. శుక్రవారం పలు పంచాయతీ గ్రామాలలో పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం చేసిన ఆయన బెన్నవరం పంచాయతీ, పినపాడు గ్రామంలో జరిగిన భాషా వాలంటీర్ల సమావేశంలో పాల్గొన్నారు. గిరిజన యువత ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా నిస్వార్థంగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, భాష వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు కె.సరుబు నాయుడు, కే.వీరయ్య, ఎం చిట్టిబాబు, కే.లక్ష్మణరావు, పి.కుమారి, జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి::రమాప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పిటిసి దీసరి గంగరాజు కోరారు. టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, గిరిజన సంఘం నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు అధికార పక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన సంఘం నాయకులు ఎస్.నాగులు, జె.సుబ్బారావు జి. కార్యకర్తలు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక, కర్షకుల, గిరిజన సమస్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం ప్రశ్నిస్తున్నారన్నారు. వీటితోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా ప్రశ్నిస్తున్నారని చెప్పారు. పట్టభద్రులైన విద్యావంతులు ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ, మండల నాయకుడు టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, సిఐటియు మండల కార్యదర్శి జె. దీనబంధు, నాయకులు జి.మధు, గిరిజన సంఘం నాయకులు వీరన్న పడాల్, శ్రీకాంత్, ధర్మారావు మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో శుక్రవారం విస్తత ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సమస్యలు చట్టసభల్లో వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థి కోరేడ్ల రమాప్రభ గెలుపుతోనే సాధ్యపడుతుందని తెలిపారు.

ముంచింగిపుట్టు:పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను కోరారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘము జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, మండల అధ్యక్షుడు గల్లెల నారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, రామదాసు, డోంబ్రు, తదితరులు పాల్గొన్నారు.